క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కంటిజబ్బు రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి చెన్నై శంకర్‌నేత్రాలయ ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కంటి జబ్బు రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మహిళ అదృశ్యంపై కేసు


సావిత్రమ్మ (ఫైల్)

గుడిపాల: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు మండలంలోని బుచ్చన్న కండ్రిగకు చెందిన సావిత్రమ్మ(53) 7వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయింది. తన ఇద్దరు కుమారులకు ఆస్తి పంపకాల్లో తన మాటా వినలేదనే నెపంతో ఇంటి నుంచి వెళ్లింది. దీంతో చుట్టు పక్కల వెతగ్గా ఎక్కడా కనిపించకపోవడంతో శనివారం వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఐపీపీబీలో సేవలు

చిత్తూరు కార్పొరేషన్: ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ)లో ఎన్‌పీసీఐ అనుసంధాన ప్రక్రియ వేగంగా జరుగుతోందని తపాలాశాఖ సూపరింటెండెంట్ లక్ష్మణ తెలిపారు. చాలామందికి బ్యాంకు ఖాతా ఉన్నప్పటికీ, ఎన్‌పీసీఐ లింక్ అవడం లేదన్నారు. అలాంటి వారు సంబంధిత తపాలా కార్యాలయాల్లో సంప్రదించి ఐపీపీబీ ఖాతాను ప్రారంభించుకోవాలని చెప్పారు. ఇటీవల విజయవాడ వరదల్లో నష్టపోయిన బాధితుల బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ లింక్ లేకపోవడంతో పరిహారం సకాలంలో జమకాలేదన్నారు. ఇదే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గమనించి, బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ అనుసంధాన ఆవశ్యకతపై అవగాహన కల్పించారని పేర్కొన్నారు.

పశుగణనకు సహకరించండి


పశుగణన సర్వే నిర్వహిస్తున్న డాక్టర్

గుడిపాల: పశుగణన సర్వేకు ప్రజలు సహకరించాలని పశువైద్యాధికారి సుధారాణి అన్నారు. పశుగణన సర్వేలో భాగంగా శనివారం ముట్టుకూరుపల్లెలో పలు గృహాలను సందర్శించి పశువుల వివరాలు నమోదు చేశారు. పశుగణనతో రైతులకు అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. ఒక కుటుంబంలో ఎన్ని పశువులు ఉన్నాయి అన్న వాటిపై సర్వేచేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని చెప్పారు. వీటి ఆధారంగా రాబోవు కాలంలో సంక్షేమ పథకాలు, పశువులకు కావలసిన మందులు రావడానికి వీలుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ పశుగణన సర్వేకు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది కిషోర్, అబ్దుల్లా పాల్గొన్నారు.

రైతుల అభిప్రాయం మేరకే జలాశయ నిర్మాణం

కార్వేటినగరం: రైతుల అభిప్రాయం మేరకే మినీ జలాశయం నిర్మాణం చేపడుతామని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. శనివారం మండల పరిధిలోని దాసరినత్తం గంగమాంబాపురం, ముక్కరవానిపల్లి గ్రామాల సరిహద్దుల్లో జలాశయం నిర్మాణానికి కుశస్థలీ నదిలో సేకరించిన స్థలాన్ని ఇరిగేషన్ అధికారులతో కలసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం కుశస్థలీ నదిపై మినీ జలాశయం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా, నిధులు మంజూరైనట్లు తెలిపారు. రైతుల అంగీకారంతో డ్యాం నిర్మాణం చేపడుతామని చెప్పారు. లేని పక్షంలో మంజూరైన నిధులను ప్రభుత్వ ఖజానాకు మళ్లించనున్నట్లు చెప్పారు.

సబ్‌స్టేషన్ పరిశీలన

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలో శనివారం లైన్ల నిర్వహణ పనుల చేపట్టారు. అందులో భాగంగా సబ్‌స్టేషన్ల వారీగా ఫీడర్ల పరిధిలో ట్రీకటింగ్స్ నిర్వహించారు. ఈఈ మునిచంద్ర రెడ్డిగుంట, కొత్తపల్లె సబ్‌స్టేషన్లను పరిశీలించారు. సిబ్బంది రీడింగ్ తీసే విధానం, సబ్‌స్టేషన్, విద్యుత్ సరఫరా బుక్ నిర్వహణ ఇతర అంశాలను చూశారు. విధిగా లైన్ నిర్వహణపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎక్కడ లైన్‌కు తీగలు అడ్డుగా ఉండదరాదన్నారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు వాలిపోయి ఉంటే వాటిని మార్చాలని చెప్పారు. వదులుగా ఉన్న తీగలను సరిచేయాలని ఆదేశించారు.


రెడ్డిగుంట సబ్‌స్టేషన్ పరిశీలిస్తున్న ఈఈ మునిచంద్ర

కరోనా ప్రపంచాన్ని అతలాకుతలం చేసింది. ఈ మహమ్మారి చాలా మందిని పొట్టనపెట్టుకుంది. వ్యాధి నిరోధక శక్తిలోపమే కారణమని వైద్యులు తేల్చారు. ఏదిఏమైనా కరోనా ప్రజలకు ఆరోగ్యపాఠం నేర్పింది. అప్పటి నుంచి చాలా మంది ఆరోగ్యంపై శ్రద్ధ పెడుతున్నారు. వ్యాయామం, ఆహారానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆధునిక జీవనంలో అనారోగ్యంతో సతమతమవుతున్న నగరవాసులు ఆహారపు అలవాట్లు మార్చుకుంటున్నారు. సంప్రదాయ ఆహారంపై మక్కువ చూపుతున్నారు. రాగి, జొన్న జావ, చిరుధాన్యాలు, మొలకెత్తిన తృణధాన్యాలు, రాగిపుట్టు వంటి వాటిని ఉదయం, సాయంత్రం ఆహారంగా తీసుకుంటున్నారు. మునగ, జామ, ఉసిరి, క్యారెట్ వంటి వాటితో జ్యూస్, సూప్‌లు చేసి తాగుతున్నారు. దీంతో వాటికి డిమాండ్ పెరిగింది. విక్రయ కేంద్రాలు కూడా విరివిగా అందుబాటులోకి వచ్చాయి. ఉదయం అల్పాహారంగా వీటిని తీసుకుంటున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

కరోనా నేర్పిన పాఠం..

ఆహారం - వ్యాయామం



- ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యత
- పౌష్టికాహారం వైపు దృష్టి
- వ్యాయామం, జ్యూస్‌కు ప్రాధాన్యత

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కరోనా తరువాత ప్రజలు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం మొదలెట్టారు. ఫలితంగా పార్కులు, క్రీడా మైదానాల పక్కన సంప్రదాయకరమైన చిరుధాన్యాలు విక్రయిస్తున్నారు. వీరికి మంచి ఆదరణ లభిస్తోంది. దీంతోపాటు వివిధర రకాల జూస్‌లు, సూప్‌తో పాటు అల్పాహారం విక్రయ కేంద్రాలు ఇప్పుడు వెలుస్తున్నాయి. నూనెతో తయారు చేసిన అల్పాహారం ఆరోగ్యానికి హాని చేస్తుందని భావిస్తున్న వారు చిరుధాన్యాలతో చేస్తున్న అల్పాహారం వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు టిఫిన్ సెంటర్ల వారు వాటిని రుచికి తగ్గట్టుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. కొర్రల ఉప్మా, రాగులతో ఇడ్లీ, దోశ, ఉప్మా, మిల్లెట్ దోశ తదితరాలు తయారు చేస్తున్నారు. పీచు, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం వాటిల్లో ఎక్కువగా ఉండడం కొవ్వు శాతం తక్కువ కావడంతో మధుమేహం, అధిక బరువుతో బాధపడుతున్న వారు ఈ అల్పాహారంపై దృష్టి పెట్టారు.

విభిన్న రకాల జ్యూస్

వివిధ రకాల జ్యూస్ అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. మునగాకు, బూడిద గుమ్మడి, గరిక, అరటి బొందు జ్యూస్, ఉసిరి కాయ, బీట్‌రూట్, క్యారెట్, జామ, కలబందతో జ్యూస్ తయారు చేసి విక్రయించే కేంద్రాలు చిత్తూరులో వెలిశాయి. వీటిల్లో అధికపోషక విలువలు ఉండడం, ఊబకాయాన్ని, వివిధ రకాల రుగ్మతల నివారణకు ఇవి ఉపకరిస్తున్నాయని భావిస్తుండడంతో గిరాకీ పెరిగింది. 35 ఏళ్ల పైబడిన వారి నుంచి వృద్ధుల వరకు వాటిని తీసుకుంటున్నారు. చిత్తూరు నగరంలో 10 వరకు వాటి విక్రయ కేంద్రాలు ఉండగా, ఒక్కో కేంద్రంలో గ్లాస్ జూస్ రూ.50 నుంచి రూ.80 వరకు జ్యూస్ విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఎక్కువగా ఇలాంటి వాటిని వ్యాయామం, ఆ రుచి తెలుసుకున్న వ్యక్తులు క్రమం తప్పకుండా కప్పు తీసుకుంటున్నారు. అన్ని వయసుల వారు ఆహారం, ఆరోగ్యంపై దృష్టి పెడుతున్నారు. సంప్రదాయరుచులను ఆస్వాదిస్తున్నారు.

- ఉదయం వేళ అల్పాహారం స్థానంలో రాగి జావ, జొన్న గట్కా, అలోవెరా, క్యారెట్, బీట్రూట్ జ్యూస్ తదితరాలు తీసుకునేవారు పెరుగుతున్నారు. ఉదయపు నడక, వ్యాయామాలు పూర్తి చేసి ఈ ఆహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాత్రి వేళల్లో చాలా మందికి జొన్న రొట్టె ఇష్టమైన ఆహారంగా మారిపోయింది. అధిక బరువును తగ్గించేందుకు, శక్తికి, ఎముకల బలానికి, మధుమేహ నియంత్రణకు, కొవ్వును తగ్గించేందుకు ఈ ఆహారం దోహదపడుతుందని చాలా మంది ఆసక్తి చూపిస్తున్నారు.
- నిత్యం ఒక్కో కేంద్రంలో మునగ, జామ జ్యూస్ కోసం 150 మంది వరకు వస్తున్నారని నిర్వాహకులు తెలుపుతున్నారు. వ్యాయామం చేసేవారే కాకుండా ఉద్యోగులు, గృహిణులు వీటిని తీసుకోవడం పెరుగుతోంది.
- మొలకెత్తిన తృణధాన్యాలను నిత్య ఆహారంలో భాగంగా చేసుకుంటున్నారు. దీంతో విక్రయాలు పెరుగుతున్నాయి.


రాగి పుట్టు విక్రయ కేంద్రం

భలే టేస్టీ రాగిపుట్టు

చిత్తూరు నగరంలోని డీఐ రోడ్డులో రాగిపుట్టుకు భలే గిరాకీ ఏర్పడింది. టేస్టీగా ఉండడంతో ప్రజలు ఇష్టపడుతున్నారు. ఇది ఆరోగ్యానికి మంచిది కావడంతో సాయంత్రం పూట రాగి పుట్టు బండి వద్ద జనం కిటకిటలాడుతుంటారు. ఒక కప్పు తింటేనే కడుపు నిండిపోతుంది. ఆరోగ్యాన్ని బలాన్నిచ్చే ఫుడ్ అంటూ ప్రజలు సైతం ఇష్టపడి తింటున్నారు. గతంలో మార్కెట్ సర్కిల్‌లో విక్రయించేవారు. ఇప్పుడు డీఐ రోడ్డులో మాత్రమే దొరుకుతోంది.

మునగ, జామ జ్యూస్ గిరాకీ ఉంది



నేను మునగ ఆకు సూప్, గరిక జ్యూస్, అరటి బొందు జ్యూస్, కేరట్ జ్యూస్, బీట్‌రూట్ జ్యూస్ అమ్ముతున్నాం. వ్యాయామం చేసే వాళ్లు క్రమం తప్పకుండా వచ్చి తాగుతున్నారు. అలాగే బీపీ, షుగర్ ఉండే వ్యక్తులు ఈ జూస్, సూప్‌ను తీసుకుంటున్నారు. ప్రధానంగా నగరంలో అయితే ఎక్కువగా మునగ, జామ ఆకుల జ్యూస్ అందుబాటులో ఉంచాము. ఇది అంత రుచిగా లేకున్నా ఆరోగ్యం కాబట్టి డిమాండ్ మాత్రం అధికంగానే ఉంది.

–శశి, షాపు నిర్వాహకుడు, చిత్తూరు


మునగ, జామ ఆకుల సూప్, జ్యూస్ విక్రయ కేంద్రం

రోజూ వ్యాయామం చేస్తా



ప్రస్తుత పరిస్థితుల్లో మనిషి బతకడం 50 ఏళ్లు కష్టంగా ఉంది. దీనికి తోడు పండించే పంటలకు రసాయనమవుతున్నాయి. తినే ఆహారం కూడా కల్తీ కావడం వల్ల మనిషి ఆయుష్ అర్థం తరమవుతోంది. ఇలాంటి తరుణంలో వ్యాయామం, మునగ, జామ, ఉసిరి జ్యూస్‌లు ఆరోగ్యానికి కొంత మేలు చేస్తాయి. నేను ప్రతి రోజు ఉదయం వ్యాయామం చేస్తాను. ఆ తరువాత కాఫీకి బదులుగా మునగాకు సూప్, జామ జ్యూస్ తీసుకుంటా.

–కుమార్, చిత్తూరు

సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న విజయ భండారు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మాతృత్వ భావన చాటున ఎదురయ్యే సవాళ్లను మహిళలు ధైర్యంగా ఎదుర్కొని అనుకున్నది సాధించాలని హైదరాబాద్‌కు చెందిన యోధ కథల సంకలన సంపాదకులు విజయ భండారు అన్నారు. జిల్లా రచయితల సంఘం ఆత్మీయ స్రవంతి కార్యక్రమంలో భాగంగా శనివారం చిత్తూరులోని విజయం విద్యా సంస్థల ప్రాంగణంలో యోధ కథల సంకలన పరిచయ సభ నిర్వహించారు. ఇందులో ఆమె మాట్లాడుతూ మహిళలు బాల్యం నుంచి మాతృత్వపు కీర్తిగానం వింటూ పెరుగుతుంటారని చెప్పారు. మాతృత్వపు అరాధన బాగున్నట్లే ఉంటుందని, కానీ ఒక రోజు ఈ ఆరాధాన నీటి బుడగల్లా పగిలిపోయి జీవితంలో ఎదురైన మానసిక, శారీరక సంఘర్షణలు, సామాజిక సవాళ్లు కళ్లముందు కనబడతాయన్నారు. ఇటువంటి కష్టాలను ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని ధైర్యంగా నిలబడిన యోధల జీవిత చరిత్రలు మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి సహదేవనాయుడు, విజయం పాఠశాల నిర్వాహకురాలు శైలజ, డాక్టర్ రామలక్ష్మి, అరుణ, ఆనందనాయుడు, అశోక్‌కుమార్, నాగరాజు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ పద్ధతిని రద్దు చేయాలి


ఏఈఓకు వినతి ప్రతం అందజేస్తున్న సీపీఐ నేతలు


కాణిపాకం: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిని రద్దు చేసి కనీస వేతనం అమలు చేయాలని శనివారం కాణిపాకం ఏఈఓ రవీంద్రబాబుకు సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కాణిపాకం దేవస్థానంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిని రద్దు చేసి దేవస్థానమే నిర్వహించాలని ప్రభుత్వాన్ని, దేవదాయశాఖ అధికారులను డిమాండ్ చేశారు. 20 నుంచి 25 ఏళ్లుగా దేవస్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, శానిటేషన్ సిబ్బంది అందరూ ఒకే పని చేస్తున్నప్పటికీ జీతాల్లో వ్యత్యాసం ఏమిటని అధికారులను సూటిగా ప్రశ్నించారు. సిబ్బందికి కనీస వేతనంతో పాటు ఈఎస్‌ఐ గుర్తింపు కార్డు, యూనిఫారం మంజూరుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

నిరంతర ధ్యానసాధనతో ఆరోగ్యం


ప్రసంగిస్తున్న సీనియర్ పిరమిడ్ మాస్టర్ హరికృష్ణ, సదస్సుకు హాజరైన ధ్యానులు

తవణంపల్లె: నిరంతర ధ్యానసాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ హరికృష్ణ బోధించారు. మండలంలోని సిద్ధంపల్లె సమీపంలోని శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పిరమిడ్ మాస్టర్ హరికృష్ణ మాట్లాడుతూ జీవుడే దేవుడు, దేహమే దేవాలయమన్నారు. మన ఆలోచనా విధానాన్ని బట్టి మన జీవితం ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ధృఢ సంకల్పం, పట్టుదలతో కృషి చేస్తే ఏ పనిలోనైనా విజయం సొంతం అవుతుందని తెలిపారు. మనం తినే ఆహార పదార్థాల లోపాలవల్లే ఎక్కువ మంది అనారోగ్యానికి గురవుతున్నారని కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ పార్వతి, జిల్లా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ గ్లోబల్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక, ధ్యానులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

యాదమరి(పూతలపట్టు): మండలంలోని అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే మురళీ మోహన్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, ప్రజలకు వారధిలా పనిచేయాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి విషయంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వ్యవసాయ రంగంలో మెలకువలు ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తూ, గ్రామ స్థాయిలో అధికారులు పర్యటిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలియజేశారు. యాదమరి -గుడియాత్తం అంతర్రాష్ట్ర రోడ్డు మరమ్మతులకు ప్రత్యేక నిధులు కేటాయించి, నవంబర్ చివరాఖరి లోపు భూమి పూజ పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన తీసుకుని రావాలని కోరారు. యాదమరిలో పరిశ్రమను తీసుకొచ్చి మహిళలకు ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు.

ఎంపీపీ, జెడ్పీటీసీ ఎక్కడ?

యాదమరి ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీపీ సురేష్‌బాబు, జెడ్పీటీసీ ధనంజయరెడ్డి గైర్హాజరయ్యారు. మూడు నెలల క్రితం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి వచ్చిన ఎంపీపీ, జెడ్పీటీసీలను కార్యాలయం లోపలికి రానివ్వకుండా తిరిగి ఇంటికి పంపించేశారు. ప్రజాప్రతినిధులపై నీచంగా ప్రవర్తించిన కూటమి నాయకులపై అధికార యంత్రాంగం స్పందించలేదు. ప్రజాప్రతినిధులకే ఈ దుస్థితి ఉన్నప్పుడు సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తూ వారు శనివారం నాటి సమావేశానికి హాజరు కాలేదు. ఎంపీపీ రాకపోవడంతో వైస్ ఎంపీపీ అధ్యక్షత సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీఓ వేణు నిర్వహించారు. మూడు నెలల క్రితం జరిగినట్టు మరోసారి జరుగుతుందనే ముందు ఆలోచనలతో పోలీసులు అధిక సంఖ్యలో కార్యాలయం ఎదుట భద్రతను ఏర్పాటు చేశారు. ఎటువంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా సర్వసభ్య సమావేశాన్ని అధికారులు ముగించేశారు.

ఉమ్మడి వనరుల సంరక్షణ అందరి బాధ్యత

బంగారుపాళెం: ఉమ్మడి వనరుల సంరక్షణ అందరి బాధ్యత అని ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో శనివారం మండల స్థాయి ఉమ్మడి వనరుల అభివృద్ధి సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి వనరులను సంరక్షించి, సుస్థిర ఆస్తులను ఏర్పరచుకుని నిర్వహణ చేపట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పునరుద్ధరణ చేపట్టి పనులను ప్రారంభించాలన్నారు. రిసోర్సు పర్సన్ శ్రీనివాస్ ఉమ్మడి వనరుల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లస్టర్ కో–ఆర్డినేటర్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్యం


వైద్య సేవలందిస్తున్న డాక్టర్ చంద్రమహేష్

గుడిపాల: గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక వైద్యం అందజేస్తున్నట్లు ప్రాథమిక వైద్యాధికారి చంద్రమహేష్ అన్నారు. రామభద్రాపురం గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ప్రత్యేకంగా వైద్యం అందజేస్తున్నామన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె రోగులకు సూచించారు. అనంతరం షుగర్, బీపీ రోగులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. రక్తపరీక్షలు నిర్వహించి నెలకు సరిపడే మాత్రలను వారికి ఉచితంగా అందజేశారు. మంచం పడిన రోగులకు ఇంటివద్దే వెళ్లి వైద్యం అందించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది కాంచన, అనిత, అనురాధ, చంద్రశేఖర్, శివగామి పాల్గొన్నారు.

నేడు సీపీ బ్రౌన్ జయంతి

చిత్తూరు కలెక్టరేట్: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన సీపీ బ్రౌన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు సూర్యుడుగా పేరు పొందిన సీపీ బ్రౌన్ జయంతి వేడుకలు ఆదివారం పలమనేరు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళామందిరంలో నిర్వహిస్తామన్నారు. ఆంగ్లేయుడైన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తెలుగు భాషకు చేసిన సేవలపై చర్చా కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని తెలుగు భాషాభిమానులు కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

పరిశుభ్రతతోనే వ్యాధుల కట్టడి


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కేశవనారాయణ, వృద్ధులకు బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

తవణంపల్లె: పరిశుభ్రతతోనే వ్యాధులను అరికట్టవచ్చని వైద్యాధికారి కేశవనారాయణ తెలిపారు. మండలంలోని కారకాంపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేయించారు. గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పల్లెలో పారిశుధ్యం మెరుగుపరచుటకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమలను లార్వా దశలోనే నశింపచేయాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

చారాలలో ఫ్యామిలీ డాక్టర్

మండలంలోని చారాలలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ ఆరోగ్య సూత్రాల గురించి వివరించారు. ఆరోగ్యంతో మనిషి సంతోషంగా జీవించగలరని వివరించారు. పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. జ్వరం సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. అనంతరం గర్భవతులకు, బాలింతలకు, వృద్ధులకు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కురబ కార్పొరేషన్‌ను చిత్తూరుకు కేటాయించాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రాష్ట్ర కురబ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులకు కేటాయించాలని జిల్లా కురబ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జిల్లాలోని కురబలకు న్యాయం చేయాలన్నారు. ప్రధానంగా ఉమ్మడి చిత్తూరుకు కురబ కార్పొరేషన్ చైర్మన్ పదవిని కేటాయించాలని చెప్పారు. తిరుపతి, తిరుమల కొండపై కనకదాస పీఠం, మఠం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించి వెంటనే అమలయ్యేలా చూడాలని వారు పేర్కొన్నారు.

దూడలను కాపాడుకోవాలి



పాలసముద్రం: పుట్టిన దూడలకు కొద్ది రోజుల వరకు తల్లి పశువు నుంచి జున్ను పాలు పట్టించాలి. ఈ జున్ను పాలు తాగించడంతో దూడల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రోగనిరోధక శక్తి పెరిగితే వ్యాధులు అంత త్వరగా ఆశించవు. దూడలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. కొందరు తల్లి పశువు నుంచి పాలు మొత్తం తీయడంతో దూడలకు పాలు చాలక నీరసించిపోతాయి. పశు పెంపకందారులు ఈ విషయాన్ని గుర్తించి దూడలకు కావాల్సినన్ని పాలు వదిలేయాలి. దూడలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఒక్కోసారి అవి మరణించవచ్చు.

దూడలకు సోకే వ్యాధులు

- **అతిసార వ్యాధి:** అపరిశుభ్రమైన పాత్రలు, షెడ్లలో తడి, బురద ఉండడం, ఆహారాన్ని పరిమితికి మించి పెట్టడంతో అతిసార వ్యాధి సోకుతుంది. దుర్వాసనతో కూడిన నీళ్ల విరేచనాలతో దూడలు నీరసిస్తాయి. బరువు కోల్పోతాయి. 1–3 వారా ల దూడల ఈ వ్యాధికి లోనవుతాయి.

చికిత్స: బిస్‌మత్ సబ్ నైట్రేట్ ఈ వ్యాధిని అదుపు చేస్తుంది. వైద్యుని సలహాతో సల్ఫా, యాంటిబయాటిక్స్‌ను వాడాలి. దూడ పుట్టిన అరగంటలోపు జున్నుపాలు పట్టించాలి. దూడలకు పరిమితికి మించి పాలను పట్టించకూడదు. షెడ్లను పరిశుభ్రంగానూ, గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేట్లుగానూ ఉంచుకోవాలి.

- **తెల్లపారుడు:** కొన్ని రకాల వైరస్, బ్యాక్టీరియాలతో లేగ దూడలకు ఈ వ్యాధి సోకుతుంది. దూడలు విపరీతంగా పారుతాయి. పారుడుకు ముందు జ్వరం వస్తుంది. కీళ్లు లోపలికి పీక్కుపోతాయి. ఆకలి మందగిస్తుంది. చర్మం పొడిగా, గరుకు ఉంటుంది. కాళ్లలో సత్తువ లేక నీరసించిపోతాయి.

చికిత్స: పశువైద్యుని సలహాతో సల్ఫా యాంటీ బయాటిక్స్, డైక్స్ట్రోజ్ సెలైన్ వాడాలి.

- **రక్త విరేచనాలు:** ఎక్కువ పాలు తాగించడంతో, సూక్ష్మజీవులు కొక్కిడియా ఆశించి ఈ వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి సోకిన దూడల మలం రక్తంతో కూడి ఉంటుంది. దీన్ని గమనించి, పశుశాలను శుభ్రంగా ఉంచడంతో పాటు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి.

చికిత్స: సల్ఫా యాంటీ బయాటిక్స్‌ను వాడితే వ్యాధి తగ్గిపోతుంది.

- **నిమోనియా(ఊపిరితిత్తుల వ్యాధి):** బ్యాక్టీరియా, వైరస్‌ల ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. షెడ్లలో తేమ ఎక్కువగా ఉండడం. చలిగాలుల నుండి సరైన రక్షణ లేకపోవడంతో ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన దూడలకు జ్వరం వస్తుంది. శ్వాస ఇబ్బందికరంగా ఉంటుంది. ఆకలి మందగిస్తుంది. కళ్లు, ముక్కు నుంచి నీరు కఫం వస్తుంది.

చికిత్స: పశుశాలలను శుభ్రంగా ఉంచడంతోపాటు చలిగాలుల నుంచి దూడలను రక్షించాలి. సల్ఫాతో పాటు యాంటిబయాటిక్స్‌ను వైద్యుని సలహాతో వాడాలి.

- **కీళ్ల జబ్బు–బొడ్డు వాపు:** దూడ బొడ్డు సంచికి సూక్ష్మ జీవులు ఆశించడంతో ఈ వ్యాధి సోకుతుంది. బొడ్డునరం సరిగా వేరు చేయనప్పుడు, కత్తిరించడంలో అజాగ్రత్తలతో ఈ వ్యాధి వ్యాపిస్తుం ది. దుర్వాసనతో కూడిన చీము కారుతుంది. సూక్ష్మజీవులు కీళ్లకు కూడా వ్యాపించి కీళ్ల వాతం వస్తుంది.

చికిత్స: దూడ బొడ్డు నరాన్ని టింక్చర్ అయోడిన్ ముంచిన దూదితో అద్దాలి. బొడ్డు ఊడే వరకు పరిశుభ్రమైన స్థలంలో దూడను ఉంచాలి.